క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



అన్నదానం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆటోడ్రైవర్లకు మేయర్ వసీం సూచించారు. స్థానిక కోవూర్‌నగర్‌లోని భగత్‌సింగ్ ఆటోస్టాండ్‌ను మేయర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రభుత్వం వాహనమిత్ర ద్వారా ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల ద్వారా అన్ని వర్గాలభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. అమ్మఒడి, కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. అనంతరం మేయర్ ఆటో డ్రైవర్లకు అన్నదానం చేశారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, సీఐటీయూ నాయకుడు నాగేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా పాల్గొన్నారు.

కూడళ్ల వద్ద హైమాస్ లైట్ల ఏర్పాటు



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన హైమాస్ లైటు

కనగానపల్లి: జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసులు ఫ్లడ్ (హైమాస్) లైట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. రాప్తాడు నియోజక వర్గ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పరిధిలోని మామిళ్లపల్లి, పెనుబోలు, ఎన్‌ఎస్ గేట్ వద్ద జంక్షన్లలో లైట్లు ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వీటితో వాహన వేగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

క్రీడలతోనే ఒత్తిడి దూరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: క్రీడలతోనే ఒత్తిడిని దూరం చేయొచ్చని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్డీటీ స్టాఫ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాంఛో ఫెర్రర్ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్న ఒత్తిడిని తగ్గించుకోవడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. నాయకత్వ లక్షణాలు, గెలుపు ఓటమిలను సమానంగా తీసుకునే తత్వం అలవడేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మాంఛో ఫెర్రర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, డైరెక్టర్లు సంజీవ్ నంగవాన్ దశరథ్, సాగర్ మూర్తి, చంద్రశేఖర్ నాయుడు, రాజశేఖర్ రెడ్డి, రఫీక్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక సాంస్కృతిక అకాడమీ అధ్యక్షుడిగా హరి

అనంతపురం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ జాతీయ అధ్యక్షుడిగా గుత్తా హరిని ఎంపిక చేశారు. ఆదివారం శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వివరాలు అందించారు. కళావేదిక ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న గుత్తా హరి సాహిత్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

వైభవంగా పోతలయ్యస్వామికి బోనాలు



బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



అలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో ఆదివారం పోతలయ్యస్వామికి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని పోతలయ్యస్వామిని వెండి, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలకంరించి భక్తులు పూజలు నిర్వహించారు. తర్వాతా గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు. రైతులు, గొర్రెల కాపరులు జీవాలను పోతలయ్య స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని పోతలయ్యస్వామికి ఏటా బోనాల పండుగ చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- జలజీవన్ మిషన్‌తో తీరనున్న నీటి కష్టాలు
- పీఏబీఆర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు
- రూ.56.20 కోట్లతో ముమ్మరంగా పనులు

ఆత్మకూరు: మండలంలో దశాబ్దాలుగా ఉన్న తాగు నీటి సమస్య పరిష్కారమవుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత మండల వ్యాప్తంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. మండల వ్యాప్తంగా 26 గ్రామాలు ఉన్నాయి. మొదటి విడతలో భాగంగా మండలంలో 16 గ్రామాలను ఎంపిక చేశారు. వాటిలో సింగంపల్లి తండాలో పనులు పూర్తయ్యాయి. ప్రతి ఇంటికీ తాగునీరు అందుతోంది. మిగిలిన గ్రామాల్లో రెండో విడత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రత్యేక పైప్‌లైన్: మండలంలో నీటి సమస్య పరిష్కరించడానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీవ్ర కృషి చేశారు. జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలానికి మొదటి విడతలో రూ.2.10 కోట్లు, రెండో విడతలో రూ. 54.10 కోట్లతో పనులు చేపట్టారు. దీనికి సంబంధించి పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసి, నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. పీఏబీఆర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ పనుల అనంతరం నీటి సమస్య ఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్ తెలిపారు. ఆత్మకూరు మేజర్ పంచాయతీలో జలజీవన్ మిషన్ ద్వారా మొదటి విడతలో రూ.74 లక్షలు, రెండో విడతలో రూ.1.75 లక్షలతో పనులు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తెలిపారు.

దశాబ్దాల సమస్య పరిష్కారం



ఏళ్ల తరబడి నీటి సమస్యతో ఇబ్బంది పడ్డాం. కొళాయిల వద్ద పడిగాపులు కాశాం. ప్రస్తుతం జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేస్తున్నారు. మా కాలనీలో త్వరితగతిన పనులు చేశారు. త్వరలో నీరు వస్తుందని అధికారులు చెప్పడంతో ఆనందంగా ఉంది.

- శివకుమార్, ఆత్మకూరు

చాలా ఆనందంగా ఉంది



నీటి సమస్యతో పలు కాలనీల్లో మేజర్ పంచాయతీలో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ప్రత్యేకంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. పీఏబీఆర్ ద్వారా పైప్‌లైన్ వస్తే నీటి సమస్య ఉండదు. ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

- వరలక్ష్మి, ఆత్మకూరు సర్పంచ్

ప్రాణాలకు తెగించి సేవ



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ బుల్లే లావణ్య

వలంటీర్లకు వందనం

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పథకాలు పారదర్శకంగా అర్హులందరికీ వర్తింపజేసేందుకు ప్రతి 50 ఇళ్లకూ ఒక వలంటీర్‌ను నియమించింది. దీంతో వలంటీర్లు వారికి అప్పగించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ, సమస్యలు తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాప్తాడుకు చెందిన బుల్లే లావణ్య 2019లో వలంటీర్‌గా చేరింది. నాలుగేళ్ల నుంచి వలంటీర్‌గా తన పరిధిలోని ప్రజలకు పథకాలు చేరవేయడంలో కృషి చేస్తోంది. కరోనా విపత్కర సమయంలోనూ రాప్తాడును రెడ్‌జోన్‌గా ప్రకటిస్తే .. ప్రాణాలకు తెగించి, కరోనా బాధితులకు సేవలందించింది. అప్పటి కరోనా బాధితులు ఇప్పటికి బుల్లే లావణ్య సేవలను గుర్తు చేసుకుంటూ అభినందిస్తున్నారు.

తెల్లవారకముందే పింఛన్ ఇస్తున్నారు



తెల్లవారుజామున 5 గంటలకే తలుపు తట్టి వలంటీర్ బుల్లే లావణ్య పింఛన్ అందజేస్తోంది. నేను దివ్యాంగుడిని కావడంతో గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడేవాడిని. నా కొడుకు సహాయంతో పంచాయతీ కార్యాలయానికి చేరుకొని, రోజంతా పడిగాపులు కాసి పింఛన్ తెచ్చుకునేవాడిని. ఒక్కోసారి నాలుగైదు రోజులైనా పింఛన్ అందేదికాదు. ప్రస్తుత వలంటీర్లు 1వ తేదీనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. వలంటీర్ల సేవలు మరిచిపోలేం. వారిపై తప్పుడు వ్యాఖ్యలు సరికావు.

- మంగళ నారప్ప, దివ్యాంగుడు, రాప్తాడు

స.హ.చట్టం బోర్డులో పేర్లు మార్చరా?

అనంతపురం టౌన్: గనులశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు మారినా స.హ. చట్టం బోర్డులో పేర్లు మాత్రం మార్చలేదు. మూడు నెలల క్రితం గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ అధికారితోపాటు ఏడీ స్థాయి అధికారులు బదిలీ అయ్యారు. అప్పిలేట్ అధికారిగా గతంలో ఇక్కడ డీడీగా పని చేసిన పాపరావు పేరుతోపాటు ప్రజాసమాచార అధికారి తోట సుబ్రమణ్యం పేర్లను కూడా బోర్డులు అలాగే ఉంచారు. ప్రస్తుతం వీరిద్దరూ జిల్లాలోనే పనిచేయలేదు. ప్రస్తుతం గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల వివరాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



స.హ.చట్టం బోర్డులో గతంలో పని చేసిన అధికారుల పేర్లను అలాగే ఉంచిన దృశ్యం

రసాయన మందుల వాడకంలో జాగ్రత్తలు అవసరం

బుక్కరాయసముద్రం: రైతులు పొలాల్లో రసాయన మందులు వాడకంపై తప్పనిసరిగా జాగ్రత్తలుపాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు రసాయన మందుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కేవీకేలో 95వ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు చీడ పీడల నివారణలో పాటించాల్సిన మెలకులను వివరించారు. రసాయన మందులు పిచికారీలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం దత్తత గ్రామాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, సస్యఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ రెడ్డి, విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన, రాఘవంపల్లి, చాపట్ల, చామలూరు గ్రామాల రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

పీఎఫ్‌ఐ సేవలు అభినందనీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సెంట్రల్: గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో పీఎఫ్‌ఐ సంస్థ అందిస్తున్న సేవలు ఎనలేనివని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. 1952లో సంస్థను ప్రారంభించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ అనేక కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎఫ్‌ఐ నేషనల్ చైర్మన్ కరీం, ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, చాయాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి ప్రబోధిత చిత్రాన్ని ఆదరించండి

అనంతపురం కల్చరల్: దేశభక్తిని ప్రబోధించే చిత్రాలను ఆదరించాలని కళాకారులు కోరారు. ఆదివారం స్థానిక గౌరీసినీ కాంప్లెక్స్‌లో 'భారతీయన్స్' సినిమా విడుదల సందర్భంగా ప్రత్యేక సమావేశం జరిగింది. ఆత్మీయ అతిథులుగా ఘంటసాల ఆరాధన సమితి గౌరవాధ్యక్షులు జి.రామయ్య, ఆచార్య సుధాకరబాబు, హెల్పింగ్ హ్యాండ్స్ జగన్ తదితరులు హాజరై మాట్లాడారు. 'భారతీయన్స్' సినిమాను పూర్తి స్థాయిలో అనంతకు చెందిన శంకర్ అడుసుమిల్లి నిర్మించగా, ఎస్కేయూ పూర్వ విద్యార్థి దీన్‌రాజ్ దర్శకత్వం వహించారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సినిమా మంచి గుర్తింపును తెచ్చుకుందని, దేశభక్తిని ప్రధాన కథాంశంగా తీసిన సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. జాతీయ జండాలతో కళాకారులు, విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ విజయ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండలం తూట్రాలపల్లి కొత్తపల్లికి చెందిన వేలూరు అదెప్ప నాయుడు(52) శనివారం రాత్రి కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దర్శనం చేసుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న మట్టి కుప్పను గమనించకుండా వేగంగా వచ్చి ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అదెప్పను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకుజామున అదెప్ప మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు గ్రామంలో శ్రీకాంత్ అనే వ్యక్తి రంగనాయకులు అనే వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. పక్కపక్క ఇళ్లలో ఉండే రామన్న, హరి అనే వ్యక్తులకు పాతకక్షలున్నాయి. ఆదివారం రాత్రి ఇంటి ముందు గురుసు తోలే విషయంలో రామన్న, హరి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో సర్దిచెప్పేందుకు వెళ్లిన రంగనాయకులుపై రామన్న అల్లుడు శ్రీకాంత్ కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రంగనాయకులును కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

సంబరం..అపూర్వ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. 22 ఏళ్ల తర్వాత అందరూ ఇలా కలుసుకున్నారు. ఒకరినొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. పాఠశాలలో గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సరదాగా గడిపి, ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. అంతకుముందు గురువులు ఆంజనేయులు రెడ్డి, రంగరాజు, నారాయణరెడ్డి, నాగేశ్వరాచారి, విజయ శేఖర్ రెడ్డి, శ్రీనివాసులును సన్మానించారు. చియ్యేడు, కృష్ణమరెడ్డిపల్లి, పూలకుంట దుర్గం తదితర గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం తమవంతుగా ఆర్థిక సాయం అందించారు.





గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం , జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగా జనార్దన తదితరులు

గవర్నర్‌కు ఘన స్వాగతం

శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం రాత్రి అనంత నగరానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, జేఎన్‌టీయూఏ వీసీ రంగా జనార్దన తదితరులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

సంతల ద్వారా రూ.3.54 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంత ద్వారా రూ.3.54 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.99,620 వసూలయ్యిందని, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,54,800 వసూలైనట్లు తెలిపారు.

వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడిగా హర్ష వర్ధన్‌రెడ్డి, అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కేశవరెడ్డి, కోశాధికారిగా నారాయణ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా భాస్కరరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జయచంద్ర, మురళీ, ప్రభాకర్, మహిళా సభ్యులుగా యశోదమ్మ, సువర్ణమ్మ, వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులు మాధవి, మునిస్వామి, కండక్టర్ నాగరాజు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..గుత్తి నుంచి అనంతపురానికి ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. అయితే గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ మలుపు వద్ద బస్సును ఎదురుగా లారీ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ నాగరాజు(కర్నూలు), ప్రయాణికులు మాధవి(బెంగళూరు), మునిస్వామి(కర్నూలు జిల్లా తుగ్గలి) తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు మాధవిని అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్రియా యోగా దీక్షతో అత్యుత్తమ స్థితి





సాధకులతో మాట్లాడుతున్న స్వామీజీ , వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన యోగా సాధకులు

అనంతపురం కల్చరల్: మనిషి అత్యుత్తమ స్థితికి క్రియా యోగా దీక్ష ఎంతో దోహదపడుతుందని వైఎస్‌ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద పేర్కొన్నారు. అనంతలో యోగదా రాష్ట్ర స్థాయి సాధనా సంఘ సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. యోగదా సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద, రాంచీ నగరం నుంచి విచ్చేసిన స్వామి ప్రజ్ఞానానంద, స్వామి కేదారానంద సమావేశాల్లో కీలక ఘట్టమైన క్రియా యోగా దీక్షను సాధకులకు ప్రసాదించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి చెడు ఆలోచనలు రాకుండా క్రియా యోగం మనిషికి కవచంలా కాపాడుతుందన్నారు. అనంతలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించిన జిల్లా యోగా ప్రతినిధులు చంద్రశేఖర్, కేశవరెడ్డి, నరసింహులు, సురేష్, రామకృష్ణ తదితరులను వారు అభినందించారు. అంతకు ముందు వివిధ రాష్ట్రాల నుంచి గురువుల ఆశీర్వాదానికి వచ్చిన 300 సాధకులకు పుస్తక ప్రసాదాలు అందించారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామికి అలంకరణ, ఆకు పూజ, అర్చన, మహానైవేద్యం తదితర పూజలు చేశారు. దోష నివారణకు కుజదోష, కాలసర్పదోష పూజలు, మూల మంత్ర బీజాక్షర హోమాలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. భక్తులు ఆటయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామికి పార్వతిదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తాడిపత్రి: మండలంలో ఎవరైనాశాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీఎం గంగయ్య హెచ్చరించారు. ఆదివారం రూరల్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న 60 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు అల్లర్లు మాని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

రాప్తాడురూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ సదాశివనగర్‌లో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ నిర్మాణ సమావేశం నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగరాజు, శ్రీకాంత్ , మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి పద్మావతి, సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, రాప్తాడు, ఆత్మకూరు మండల కార్యదర్శులు రవీంద్ర, రామకృష్ణ, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం అందించండి

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుజ్జల సరళాదేవి నగర్‌లో ఆదివారం సైబర్ నేరాలు, మహిళల చట్టాలపై అవగాహన స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు, బాలికలు సెల్‌ఫోన్లు వాడే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు.